మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**అచ్చంపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు సమయపాలన పాటించాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో మెడికల్ వార్డు, డయాలసిస్‌సెంటర్, గైనిక్ వార్డులను పరిశీలించి పెషెంట్ల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డులో మందులు కావాల్సిన వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదని ఆయన పేర్కొన్నారు. నల్లమల్ల ప్రాంతంలో ఉన్న ఏరియా ఆసుపత్రిని అన్ని హంగులతో రూపుదిద్దుకునేలా ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యాన్ని అందించడంతో పాటు అత్యావసర సేవలను కూడా అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లమల్ల ప్రాంత అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, విద్య, వైద్యానికి కొరత లేకుండా నల్లమల్ల ప్రాంత ప్రజల ఆరోగ్య బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో ఈ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్యులు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రభు, డీసీహెచ్ రామకృష్ణ, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అడ్వకేట్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితమల్లేష్, వైద్యులు మహేష్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 109ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమసమస్యలను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్, అధికారులను విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, యూసుఫ్‌అలీ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

## ప్రజావాణికి 42 దరఖాస్తుల స్వీకరణ

**గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**

**గద్వాల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 42 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాసరావు, నర్సింగ్‌రావు, ఆర్డీఓ రామచందర్‌లతో కలిసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**నారాయణపేటజిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** ప్రజాఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ జిల్లా కార్యాలయంలో 8 ఫిర్యాదులను స్వీకరించి వాటటిని చట్ట ప్రకారం పరిశీలించాల్సిందిగా సిఐ, ఎస్సైలకు సూచించారు. రెండు ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబంధించినవి కాగా, ఒక్క ఫిర్యాదు మిస్సింగ్ కేసులు సంబంధించి మిగతా 5 ఫిర్యాదులు భూములకు సంబంధించి రావడం జరిగింది. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

## గందరగోళంలో డైట్ టెండర్..

**టెండర్ దారుల అభియోగాలతో జిల్లా ఆస్పత్రి టెండర్ రద్దు..**

**సీల్డ్ కవర్ ప్రక్రియ లేకుండా లాటరీ పద్ధతి ద్వారా టెండర్ నిర్వహణ..**

**త్వరలోనే డైట్ టెండర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రెండు రోజులు గడువు..**

**వనపర్తిప్రతినిధి సెప్టెంబర్30 ప్రభాతవార్త :** ప్రతి ఏడాది నిర్వహించే డైట్ కాంట్రాక్టర్ల గడువు ముగియడంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ ఆదేశాలతో టెండర్ నోటీస్ ప్రక్రియ విడుదల చేయడంతో టెండర్ ప్రక్రియకు 12 టెండర్ దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే స్క్రూటీలో 8 మందిని టెండర్ దారులను తొలగించగా మిగిలిన నలుగురితో టెండర్ ప్రక్రియ నిర్మించాలని ఉన్నతాధికారులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్‌కి ఆదేశించారు. అయితే సోమవారం నిర్వహించాల్సిన డైట్ కాంట్రాక్టార్లు అభియోగాలతో ఆరోపించడంతో వారి ఆరోపణను స్వీకరించిన జిల్లా ఉన్నతాధికారులు సిల్ట్‌కవర్ పద్ధతికాకుండా 70శాతం అర్హతఅయిన వాళ్లను లాటరీ పద్ధతిలో తీయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే డైట్ టెండర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు మరో రెండు రోజులు గడువు కావచ్చు అన్నట్లు అధికారులు అంచన వేస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం నిర్వహించాల్సిన డైట్ టెండర్ ప్రక్రియ రద్దు చేసినట్లు ఇంచార్జ్ సూపర్డెంట్ రంగారవు తెలిపారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలి..

**పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం పేట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ విభాగం ప్రదర్శనను పరిశీలించారు. జడ్పీహెచ్ఎస్ దామరగిద్దకు చెందిన విద్యార్థులు ప్రదర్శించినే ఆటోమెటిక్ స్టాప్ గేట్ ఓవర్ ఫ్లో ఎట్ బ్రిడ్జెస్ అనే ప్రాజెక్టుకు మొదటి బహుమతి లభించి రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యారు. ఈ ప్రాజెక్టును కలెక్టర్ తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జనవరిలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి యోజన ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయుటకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కృషి చేసిన సైన్స్ ఉపాధ్యాయులు అమృత్, తిప్పన్న, సక్సేన, శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అశోక్, శంభులింగం, ఇతర ఉపాధ్యాయులు పలువురు అభినందించారు. కలెక్టర్ వెంట డీఈఓతో పాటు ఉన్నారు.



సైన్స్ విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## సి.యం.ఆర్ బియ్యం సేకరణ

# వేగవంతం చేయాలి..

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** సి.యం.ఆర్ బియ్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ ఛాంబర్ లో పైర సరఫరాల శాఖ అధికారులతో సి.యం.ఆర్ రైస్ సేకరణపై సమీక్ష నిర్వహించారు. గత సమీక్ష సమావేశంలో మిల్లర్ల నుండి రోజువారీగా సేకరించాల్సిన బియ్యం సేకరించకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం ఇవ్వని రైస్ మిల్లులో తనిఖీ చేయాలని ఖరీఫ్ సీజన్ లో ఇచ్చిన వడ్లు వాస్తవంగా ఉన్నాయా లేవా? అనేది తనిఖీ చేసి సరిగ్గా నిల్వలు లేకుంటే కేసులు బుక్ చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లులు తనిఖీ రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని, రైస్ మిల్లర్ల నుండి రైస్ ఇప్పించే బాధ్యత డిప్యూటీ తహశీల్దార్లు తీసుకోవాలని ఆదేశించారు. కాలయాపన చేసిన నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పవని సివిల్ సప్లై డి.టి.లను హెచ్చరించారు.

**అక్టోబర్ 5న వరి కొనుగోలు పై జిల్లా స్థాయి సమావేశానికి ఏర్పాట్లు చేయాలి**

వరి కొనుగోలు పైకొనుగోలు కేంద్రాల ఇన్చార్జి లకు, లారి ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు, వ్యవసాయ విస్తీర్ణధికారులకు అక్టోబర్ 5వ తేదీన జిల్లా స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పి.ఏ.సి.ఎస్, ఐ.కే.పి.మెప్మా, ట్రాన్స్పోర్ట్ తదితర సంబందించిన వారు ఎవరెవరిని , ఎంతమందిని పిలవాలో ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వరి దొడ్డు రకమా లేదా సన్న రకమా అనేది సాంకేతికంగా తెలుసుకోడానికి కొత్తగా డైల్ మైక్రో యంత్రాన్ని ప్రతి పి.ఏ.సి.ఎస్ కు ఒకటి చొప్పున కొని వాడకం పై శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. ఈ సారి సన్న రకం వడ్లకు ప్రభుత్వం తరపున క్వింటాలుకు రూ.500 చొప్పున ప్రోత్సాహకం ఇస్తునందున గతంలో కంటే రెండు మూడింతలు అధిక వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున దాదాపు 300 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన మేరకు గన్ని బ్యాగులు, తమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలు, వేరు చేసేందుకు ఫ్యాన్ లు సమకూర్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా సివిల్ సప్లయి అధికారి కాశి విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ప్రసాద్ రావు, జిల్లా తూనికలు కొలతల అధికారి డి.సత్యనారాయణ, డి.పి.యం అరుణ, డి,యం ఇర్ఫాన్, సివిల్ సప్లై డి.టి లు తదితరులు పాల్గొన్నారు.



సివిల్‌సప్లై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## భూత్పూర్‌లో మండల ప్రజావాణిని

# పరిశీలించిన కలెక్టర్,అడీషనల్ కలెక్టర్

**భూత్పూర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** సోమవారం భూత్పూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, అడీషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లు పరిశీలించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, అభ్యర్థనలను ఎప్ప టికప్పుడే పరిష్కరించాలని, సమస్యలు స్పాట్ పరిష్కారం కాని వాటికి జిల్లా ప్రజావాణికి సమర్పించాలని కలెక్టర్ విజయేంద్ర బోయి అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంతవరకు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఇక్కడికిక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసు కోవాలని ఎంపిడీపీ ప్రభాకర్‌చారి, తహశిల్దార్ ఎంఎ రహమాన్‌లను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డితో పాటు మండల వ్యవసాయాధికారి మురళీధర్, పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్, ఏఈ పంచాయతీరాజ్ సీఎస్ స్వామి, డిప్యూటీ ఈఈ నర్సింహులు, విద్యుత్‌శాఖ ఏఈ మాధ్యులస్, ఎక్సైజ్ పీసీ వెంకటేశ్వర్లు, ఏఈ ఎండి ఉమేర్, ఇరిగేషన్ ఏఈ సురేష్, ఏఈ రాజేంద్రప్రసాద్, ఇరిగేషన్ సూపరిన్‌టెండెంట్ వసీం సుల్తానా, ఏపీఓ విమల, ఎంపీఓ శ్రీదేవి, ఎంఈఓ ఉషారాణి, ఐసీడీఎస్ సూపరిన్‌టెండెంట్ మహేశ్వరి, ఎఫ్‌బీఓ అనిత, ఆరోగ్యశాఖ డాక్టర్ రాధిక, ఏపీఎం హైమావతి ఇతర అధికారులు పాల్గొన్నారు.



భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి,అదనపు కలెక్టర్ శివేంద్ర పటేల్



భూత్పూర్ పీహెచ్‌సీలో
ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**వైద్య శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్లు**

భూత్పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ కార్మికులకు నిర్వహించిన వైద్యశిబిరాన్ని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించి వివరాలను పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్‌లను అడిగి తెల్సుకున్నారు. పారిశుద్ధ్య కార్మికుల రక్తనమూనాలను సేకరించి జిల్లా ల్యాబ్‌కు పంపాలని, మహిళల ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆశ వర్కర్ల సమస్యల్ని కలెక్టర్ విజయేంద్ర బోయి అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, ప్రమోద్‌కుమార్ ఇతర సిబ్బంధి పాల్గొన్నారు.

## ఆదాయం వచ్చే యూనిట్లపై

# దృష్టి సారించాలి..

**మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలి**

**ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ విజయేంద్రబోయి**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కలెక్టర్ విజయేంద్రి బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** స్వయం సహాయక మహిళా సంఘాలు ఆదాయం వచ్చే యూనిట్లపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేంద్రి బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు సమస్యల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులకు పంపించిన లేఖలు, ప్రతిపాదనలపై తక్షణ చర్యలు చేపట్టి తీసుకున్న చర్యలను సంబంధిత ప్రజా ప్రతినిధులకు తెలియజేయడమే కాకుండా, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదులన్నింటిని వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దని, ఈ సోమవారం నుండి ప్రారంభించిన మండల ప్రజావాణి కార్యక్రమం నిరంతరం నిర్వహించాలని, ఫిర్యాదులను తక్షణం పరిష్కరించడం, లేదా పై స్థాయికి పంపించడం జరగాలని, ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, అన్నిచోట్ల ఆరోగ్య మహిళ క్లినిక్‌లు సక్రమంగా నడవాలని చెప్పారు. మండల స్థాయిలో వయోవృద్ధుల కమిటీలను ఏర్పాటు చేయాలని, వారికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా కమిటీలు చూడాలని అన్నారు. ఈ కమిటీలలో ఆర్డీఓ, డిఎస్పీ, జిల్లా సంక్షేమ అధికారులు సభ్యులుగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో అంగన్‌వాడి కేంద్రాల్లో శానిటేషన్‌తో పాటు, లైట్లు, ఫ్యాన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలోని ప్రభుత్వ సంస్థలలో పారిశుద్ధ్యంతో పాటు, వాటి సక్రమ నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలు బ్యాంకుల అనుసంధానంతో మంజూరు చేసిన బ్యాంకు రుణాలతో ఎప్పటిలా చట్నీలు, తినుబండారాలు, టైలరింగ్, కుట్లు, అల్లికల వంటి యూనిట్లు కాకుండా వారి కుటుంబాల జీవనోపాదులు పెంచే విధంగా, ఆదాయం వచ్చే యూనిట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి (54) ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులో ఎప్పటిలాగే రెవెన్యూ, వ్యక్తిగత సమస్యలు, భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించినవి వచ్చాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డిఆర్‌ఓ కెవివి రవికుమార్, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, ఇతర జిల్లా అధికారులు, ప్రజలవద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

# షెట్టర్లు మూసివేత..

**-32.5 ఫీట్లకు చేరిన నీటి నిల్వ**

**దేవరకద్ర, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ షెట్టర్లను సోమవారం మూసివేశారు. రోజు రోజుకు ప్రాజెక్టులోకి వచ్చి చేరే నీటి ఉధృతి క్రమేపి తగ్గుముఖం పడుతుంది. దీంతో ప్రాజెక్టు షెట్టర్లను మూసివేశారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు 32.5 ఫీట్లకు వచ్చిచేరింది. వర్షాలు తగ్గడంతో ప్రాజెక్టులోకి వచ్చి చేరే అంకిళ్ళ, కోయిలకొండ పెద్దవాగుల నుండి నీరు ప్రాజెక్టులోకి పెద్దగా వచ్చి చేరడం లేదు. దీంతో ప్రాజెక్టులో నీటి స్థోమత తగ్గింది. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరడంతో కోయిల్‌సాగర్‌కు జలకళ వచ్చింది. జలసవ్వడి చూపరులను మంత్రముగ్దులను చేస్తుంది. ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టులో కనుచూపు మేర నీరే కనిపిస్తుంది.

# నడిగడ్డ యువత మత్తుకు బానిస కావొద్దు..

**నడిగడ్డలో గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలను తరిమికొడదాం**

**త్వరలో మత్తు పదార్థాల కట్టడికై భవిష్యత్ కార్యాచరణ ..**

**నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న నదిగడ్డ హక్కుల పోరాటసమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్**

**గద్వాల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** నడిగడ్డ యువత మత్తుకు బానిస కావొద్దని, అందరం ఒక్కటిగా వుండి మన ప్రాంత యువతను మత్తు పదార్థాలకు లోనవకుండ కాపాడుకోవాలని, వడిగడ్డలోని మత్తుపదర్థాలను తరిమికొట్టాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గొంగల్ల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ చౌరస్తాలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల బహిష్కరణ కై నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసి ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరాహారా దీక్ష కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో యదేచ్చగా నిషేధిత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు రాజ్యమేలుతున్నాయని, వాటిని ఆరికట్టే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందని అందుకోసమే నడిగడ్డ ప్రజలకు అవగాహన కల్పించేందుకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. చాలాచోట్ల గ్రామాల్లో కల్తీ కల్లులో ఆల్ప్రాజోలం, సిహెచ్, డైజోఫాం వంటి మత్తు పదార్థాలను కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అదే కాకుండా గంజాయి , నిషేధిత డ్రగ్స్ మత్తు పదార్థాలను కలవడంతో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. గంజాయి మత్తు పదార్థాలు వాడడం ద్వారా విచక్షణ రహితాన్ని కోల్పోయి, ఉన్మాదిగా మారి అనేక చోట్ల అఘాయిత్యానికి పాల్పడి, అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి అన్నారు. ఈ నేపథ్యంలో మహిళల పై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని, నిన్న మొన్నటి వరకు జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది దీంతో భవిష్యత్ సమాజం అంధకారంలోకి వెల్లోపోయే ప్రమాదం ఉందని తెలిపారు. జిల్లాలో మహిళలపై ఇంత ఘోరం జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు స్వలాభం కోసం యువత ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, వాళ్ల ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారే తప్పా ఈ ప్రాంతలో ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి పై దృష్టి పెట్టడం లేదని ఆయన మండి పడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను బహిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీని పై సంబంధిత అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొతగ్గకుండా బాధ్యతగా పనిచేసి సమాజ హితానికి పాటు పడాలని కోరారు. ఈ విషయం పై నడిగడ్డ హక్కుల పోరాట సమితి త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటు చేసి నార్కొటక్ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయుటకు భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటు చేస్తుందని . ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



నిరహార దీక్ష లో కూర్చున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

**సంపూర్ణ మద్దతు తెలిపిన పలువురు నాయకులు**

మత్తు పదార్థాల బహిష్కరణకై నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టిన జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ సిపిఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, బీజేపీ జిల్లా అద్యక్షులు రామచంద్రా రెడ్డి, పట్టణ అధ్య క్షులు బండల వెంకట్రాములు, చిత్తారి కిరణ్, విశ్వహిందూ పరిషత్ ఎర్ర జనార్ధన్, టిఆర్ఎస్ నాయకులు సునంద్, మహమ్మద్ రఫీ తదితరులు సంఘీభావం ప్రకటిస్తూ జిల్లాకు మత్తు మాఫియాలకు బానిస కానీయకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా కార్యదర్శి లవన్న, గద్వాల మండలం నాయకులు జమ్మిచేడు గౌని, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, ఇంతిరాజ్, గోపాల్ మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, ఉపాధ్యక్షులు ప్రేమ్ రాజ్, నజూముల్లా, కార్యదర్శి తిమ్మప్ప, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్, ఉపాధ్యాక్షులు అడివి ఆంజనేయులు, కార్యదర్శి రాము, గట్టు మండల అధ్యక్షులు బలరాం నాయుడు ఉపాధ్యక్షులు దయాకర్, మల్దకల్ మండల నాయకులు మీసాల కిష్టన్న, చిన్న రాముడు, లక్ష్మన్న, నేతన్న, రమేష్, కృష్ణ, కే.టి.దొడ్డి మండల నాయకులు విజయ్, భీమన్ గౌడ్, సుభాష్, సామియేల్, స్వామి, గట్టు మండల నాయకులు జమ్మన్న, రఘుపతి, వీరన్న, వెంకటప్ప, ధరూర్ మండల నాయకులు జమ్మన్న, మల్దకల్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల డిడిల డబ్బులు వాపస్..

**295 మంది ఖాతాల్లో కోటి 29 లక్షలు..**

**ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన కుర్వ సంఘం నేతలు**

**మక్తల్ టౌన్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ స్కీమ్‌లో భాగంగా డిడిలు కట్టిన వారికి నగదు వారి ఖాతాలో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి జమ చేసిందని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు టి.నాగరాజు తెలిపారు. 295 మంది గొర్రెల పెంపకందారులు తలా రూ.43,750 చొప్పున మొత్తం కోటి 29 లక్షలు డిడిల రూపంలో చెల్లించగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో డిడిల నగదు రూ. కోటి 29 లక్షలు ఖాతాల్లో



ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న దృశ్యం

జమచేశారని, ఈ సందర్భంగా ప్రత్యేకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో డిడిలు చెల్లించినా గొర్రెలు పంపిణీ చేయకపోగా కనీసం నగదు సైతం తిరిగి ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం డిడిల సొమ్మును వెంటనే వాపస్ చేసిందని, సహకరించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి సైతం ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో మాదాసి కుర్వ సంఘం నేతలు తాలూకా గౌరవాధ్యక్షుడు ముస్లాయిపల్లి రాజు,శరణప్ప, ఉట్కూర్ మండల అధ్యక్షుడు లింగప్ప, గజలప్ప, అంజప్ప, రమేష్, నర్సింహ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు కోయిల్‌సాగర్ విద్యార్థి

**దేవరకద్ర,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** జాతీయ స్థాయి క్రీడా పోటీలకు దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలకృష్ణ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో బాలకృష్ణ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా కాలేజ్ గ్రౌండ్స్‌లో ఈనెల 3, 5 తేదీలలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలలో బాల



ఉపాధ్యాయులతో విద్యార్థి బాలకృష్ణ

కృష్ణ పాల్గొననున్నాడు. దీంతో పాఠశాలలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన బాలకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ రాథోడ్, కనకప్పలతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## సీతారాం ఏచూరి సంస్మరణ సభ

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :**సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమాలతో పాటు భారతదేశానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. సాగర్ అన్నారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నెహ్రూగంజ్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. కామ్రేడ్ సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను నిశితంగా పరిశీలన చేసి



సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రముఖులు

తగిన పరిష్కారాలు చూపేవారని నేపాల్ కమ్యూనిస్టు ఉద్యమం కూడా తన సలహాలను, సూచనలు తీసుకున్నదని తెలిపారు. నిప్పులాంటి మనిషి కమ్యూనిస్టు యోధుడు మరణం చాలా బాధాకరమని అన్నారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుంజనూరు ఆంజనేయులు, బాల్‌రామ్, జిల్లా నాయకులు గోవిందరాజ్, భరత్‌కుమార్, కాశప్ప, శివకుమార్, మహేష్‌కుమార్‌గౌడ్, వెంకటయ్య, నరహరి, మహ్మద్‌అలీ, బొమ్మన్‌పాడు బల్‌రామ్, బాలప్ప, శివకుమార్, బాలు, నర్సింహ, సిపిఐ జిల్లా నాయకులు నర్సింహ పాల్గొన్నారు.

## ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

**మక్తల్ టౌన్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా వివాదం రేపుతున్న అంశమైన తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తి నెయ్యితో తయారు చేసే విషయానికి గాను సోమవారం విశ్వహిందూ పరిషత్, ఎబివిపి హిందూ ధార్మిక సంస్థలు పట్టణంలో స్వామి వివేకానంద చౌరస్తా దగ్గర ధర్నా కార్యక్రమం చేపట్టారు. అక్కడి నుండి ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తూ స్థానిక తహసిల్దార్‌కు వినతి పత్రం



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

అందజేశారు. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యిని కలిపి ప్రజలను హిందూ భావజాలాన్ని దెబ్బతీసే విధంగా తయారు చేసే విషయంలో భాగస్తులైన వ్యక్తులను ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో విహెచ్‌పి నాయకులు, ఎబివిపి నాయకులు, హిందూ ధార్మిక సంస్థల నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## గణప సముద్రం ముంపు రైతులకు

## ఎకరాకు రూ.25 లక్షల రూపాయలు చెల్లించాలి

**ఖిల్లాఘణపురం సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** గణప సముద్రం రిజర్వాయర్‌లో నీటిముంపునకు గురవుతున్న రైతులకు ఎకరాకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ ఆవరణలో వనపర్తి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గణప సముద్రం ముంపు రైతుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు చెరువు అలుగును రెండున్నర ఫీట్లు పెంచారని అలుగు



సమావేశంలో పాల్గొన్న రైతులు

పెంచడం ద్వారా ఘణపురం గ్రామంలోకి రిజర్వాయర్ నీరు చెరుతుందని ఇంకా పక్కనే ఉన్న పొలాలతో పాటు ఇల్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అలుగు పెండచం ద్వారా గ్రామానికి ఆనుకుని ఉన్న భూములు పలువురు రైతులు కోల్పోవలసి వస్తుందని ఒక్కో ఎకరా కోటి పైనే ఉంటుందని దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి ఉపాధి కోల్పోతారన్నారు ముందు గ్రామంలో రాకుండా చుట్టూ కరకట్టను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

## ఖానాపురంలో మొక్కలు నాటిన మాజీ ఎంపీ

**ఆత్మకూర్ సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని ఖానాపురం గ్రామంలో ఆర్డిఓ చంద్రకళ మాతృమూర్తి స్మారకార్థం ఏర్పాటుచేసిన స్మృతి వనంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ మాజీ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి సోమవారం రోజు మొక్కలు నాటారు. గత నెలలో ఆర్డీఓ చంద్రకళ మాతృమూర్తి వార్త పడడంతో ఆర్డిఓ తల్లి పేరిట గ్రామ పరిసర ప్రాంతంలో ప్రత్యేక స్మృతి వనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి సోమవారం రోజు శృతి వనాన్ని సందర్శించి ఆర్డిఓ



ఖనాపురం లో మొక్కలు నాటుతున్న
మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పక్కన ఆర్డీఓ చంద్రకళ

ను ప్రత్యేకంగా అభినందించారు. తల్లి పేరిట స్మత్రి వనం ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను ఉపయోగించడం స్ఫూర్తిదాయకంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి కల్లుగీత పారిశ్రామిక విభాగం రాష్ట్ర చైర్మన్ నాగరాజు గౌడ్ ,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగలి గంగాధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతయ్య ,కౌన్సిలర్ చెన్నయ్య ,కాంగ్రెస్ నాయకులు నాగేష్ ,మనివర్ధన్ రెడ్డి ,వంశీ తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి...

**- నల్లమల్ల గిరిజన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి**

**- ఎన్టీఆర్ స్టేడియాన్ని రాజీవ్ స్టేడియంగా మారుస్తాం...**

**- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**అచ్చంపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**విద్యార్థినీ, విద్యార్థుల్లో విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నల్లమల్ల గిరిజన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొని ఉన్నత ప్రతిభను కనబరిచి నల్లమల్ల ఔనత్యాన్ని చాటాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల వసతి గృహల జోనల్ స్థాయి క్రీడా ఎంపికలు జిల్లా గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా జెండాను ఆవిష్కరించి క్రీడాకారులతో కరచలనం చేసి క్రీడలను ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ తోడ్పాటు ఉంటుందన్నారు. ఎన్టీఆర్ స్టేడియాన్ని త్వరలోనే రాజీవ్ స్టేడియంగా మార్చి అన్ని హంగుల సదుపాయాలతో తీర్చిదిద్దుతామని ఆయన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాల్లో ఉన్నటువంటి విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో రాణించడానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని, క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలనలో క్రీడలకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తుందని, అన్ని ప్రాథమిక పాఠశాలలకు, జిల్లా పాఠశాలలకు కూడా నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలోను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను



క్రీడల్లో పాల్గొని త్రోబాల్‌ను విసురుతున్న ఎమ్మెల్యే

పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులను మంజూరు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత బిడ్డ కావడంతో అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచి విద్య, వైద్యం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, అచ్చంపేట మున్సిపాలిటి చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఉమహేశ్వర దేవస్థాన చైర్మన్ మాధవరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజితమల్లేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేద గిరిజనులు సాగు చేస్తున్న భూములకు

## పట్టాలు వచ్చేంతవరకు పోరాటం చేస్తాం

**ఖిల్లాఘణపురం సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** అవసరమైతే ఎర్ర జెండాను పక్కనపెట్టి కూడా వందల సంవత్సరాలుగా గిరిజను సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చేంతవరకు పోరాడుతామని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట రాములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కర్ని తండా సమీపంలోని ఓ కోళ్ల ఫారం లో కర్నె తండా వెనికి తాండ ముందరి తండా మామిడి తండా భీముని తాండ లకు చెందిన దాదాపు 100 మంది గిరిజన రైతులు పాల్గొన్న సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా జెండాలు పక్కన పెట్టి వందేళ్లకు పైగా సాగు చేస్తున్న గిరిజన భూముల కోసం పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఎర్ర జెండా కింద రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పది లక్షలకు పైగా ఎకరాల భూములను గతంలో తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన దేశముకులు జాకీర్దారుల నుంచి ఇప్పించడం జరిగిందని ఇక్కడ సాగు చేసుకుంటున్న గిరిజన రైతుల కోసం అందరం కలిసికట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. మామిడమాడ గ్రామ శివారులో గిరిజనులు 355 ఎకరాలను సాగు చేసుకుంటున్నారని ఈ భూములన్ని కూడా రాజాగార్లకు చెందినవని ఇప్పటికి వారి పేరుని పట్టాలు ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మార్వో నుండి జిల్లా కలెక్టర్ వరకు అధికారులు ఏం పనులు చేస్తున్నారని దాదాపు 400 మంది రైతులు సాగు చేసుకుంటున్నా ఈ భూములు పట్టాలు ఎందుకు ఇవ్వలేకపోయారని నిలదీశారు. 1973 లోనే వచ్చిన సీలింగ్ చట్టం ద్వారా సాగుచేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వవచ్చని అధికారులు ఎందుకు నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరాములు

వహించారు అర్థం కావడం లేదన్నారు ఇక్కడ సాగు చేసుకుంటున్న గిరిజనులు వందల ఏళ్లుగా ప్రభుత్వం నుండి రైతులకు రావలసిన అనేక పథకాలకు దూరమయ్యారని వీరికి బ్యాంకుల్లో క్రాఫ్ లోన్స్ గాని రైతు భీమా గాని రైతు పెట్టుబడి సబ్సిడీ ద్వారా అందించే వ్యవసాయ పనిముట్ల కూడా నోచుకోలేకపోయారని ఆయన అన్నారు. ఈ తాండలలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులు ద్వారా మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో 15 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేసి గిరిజనులకు భూమి పట్టాలు ఇచ్చేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పద్మక్క నంద్యాల నరసింహారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు రాజు గిరిజన తండాలకు చెందిన ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### ధ్వజమెత్తిన పెబ్బేరు మండల గులాబీ దళం

**పెబ్బేరు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణం సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో పెబ్బేరు పట్టణ, మండల రైతుల బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రైతు బందు కార్యక్రమంతో వేల సంఖ్యలో రైతు కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం బడబడ నాయకులకు కొమ్ముకాస్త పేద, మద్య కుటుంబాలపై ఉక్కు పాదం మోపుతున్నారని రైతులకు అందించాల్సినటువంటి రైతుబంధు ఇప్పటివరకు అందించలేదని అలాగే ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తానని అబద్ధపు హామీలు నమ్మబలికి నేడు రైతులను నట్టేట ముంచారని మోసపు నాయకులకు ప్రజలే సరైన బుద్ధి చెప్తారని అన్నారు. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎల్లప్పుడు ముందుండి ప్రభుత్వాన్ని ప్రశ్నించి ప్రజలకు అందాల్సినటువంటి ప్రతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ



ధర్నా చేపట్టి నిరసన తెలపుతున్న బిఆర్ఎస్ నాయకులు

ని నెరవేర్చే విధంగా అహర్నిశలు కష్టపడతామన్నారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ ఆఫీస్ దగ్గరకు వెళ్లి ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేయడం జరిగింది.కార్యక్రమంలో మండల అధ్యక్షులు వనం రాములు ,మున్సిపల్ చైర్మన్ కరుణ ,సాయినాథ్ ,వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పద్మా, వేణు ,చిన్న ,ఎల్లారెడ్డి ,నాయకులు పెద్దింటి వెంకటేష్ ,పాతపల్లి గోవిందు ,మధు, వెంకటేష్,వడ్డే రమేష్, ఉద్యమకారుడు వెంకటయ్య గౌడ్,పెబ్బేరు పట్టణ,మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో గురుకుల కళాశాల గేటుకు తాళం..

**8నెలలుగా కళాశాల అద్దే బకాయిలు..**

**కళాశాల గేటుకు తాళం వేసిన భవన యజమాని**

**అద్దె చెల్లిస్తామని జోనల్ గురుకుల అధికారిని హామీ..**

**తాళం తీసిన భవన యజమాని..**

**ఇటిక్యాల సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల అద్దే భవనంలో కళాశాల కొనసాగుతుండగా 8 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో చేసేదిమి లేక భవన యజమాని ఎంజి కృష్ణ సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఉపాధ్యాయయులను సిబ్బందిని లోపలికి వెళ్ళనీయకుండా గురుకుల కళాశాల ముందు గేటుకు తాళం వేశారు. దీంతో ఇన్చార్జి ప్రిన్సిపాల్ రామాంజనేయులు గురుకుల జోనల్ అధికారి రజినితో చరవాణి ద్వారా భవన యజమానికితో జోనల్ అధికారి మాట్లాడి భవనానికి సంబంధించిన అద్దెను చెల్లించేందుకు ప్రభుత్వం దగ్గర ఫైలు పంపడం జరిగిందని వారం రోజుల్లోగా భవనానికి సంబంధించిన అద్దెను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో భవన యజమాని గురుకుల కళాశాల గేటుకు వేసిన తాళం తీశారు. అయితే అలంపూర్ నియోజకవర్గంలోని అయితే అలంపూర్ నియోజకవర్గంలోని ఐజ మండలానికి గతంలో మంజూరైన గురుకుల పాఠశాల నిర్వహణ కోసం భవనం లేకపోవడంతో 7 సంవత్సరాల క్రితం ఐజకు చెందిన గురుకుల పాఠశాలను ఇటిక్యాల మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో అప్పట్లో ఈ భవనంలో ప్రవేట్ పాఠశాల కొనసాగుతుండగా పాఠశాల మూసివేయడం





కళాశాల భవనానికి వేసిన భవన యజమాని ఎంజి కృష్ణ

తో ఈ భవనాన్ని అద్దెకు తీసుకొని గురుకుల పాఠశాలను కొనసాగిస్తున్నారు. 2 సంవత్సరాల క్రితం ఇదే పాఠశాలకు ఇంటర్మీడియట్ కూడా మంజూరు కావడంతో ఇక్కడ 5 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 640 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇలా అద్దె భవనంలో కొనసాగుతున్న ఐజకు చెందిన గురుకుల పాఠశాల భవనానికి సంబంధించి దాదాపు నెలకు 2 లక్షల దాకా చెల్లించాల్సి ఉందని యజమాని చెబుతుండగా భవనానికి పై అంతస్తు కూడా నిర్మాణం చేశానని కిరాయి కూడా పెంచాల్సి ఉండగా పెంచిన కిరాయి కూడా ఇవ్వడం లేదని అంతేకాక యజమానికి తెలియకుండా మెయింటెనెన్స్ కింద లక్షకు 5 వేల రూపాయలు కట్ చేస్తున్నారని దీనిని వ్యతిరేకంగా గురుకుల అధికారులు ఇస్తామని ఒప్పుకున్నారని అలాగే పాఠశాలకు కొత్తగా కాలేజీ కోసం డైనింగ్ హాలు, మరుగుదొడ్లు, వంటివి నిర్మించడం జరిగిందని అలాగే భవనానికి సంబంధించి చాలా సమస్యలు పెండింగులో ఉన్నాయని గురుకుల అధికారులు అద్దె చెల్లించినట్లయితే మాకు ఇబ్బంది లేకుండా ఉంటుందని యజమాని ఎంజి కృష్ణ వాపోయారు. గురుకుల కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ రామాంజనేయులు వివరణ కోరగా భవన యజమానికి 8 నెలల అద్దె చెల్లించాల్సి ఉందని నెలకు 1 లక్ష 29 వేల రూపాయలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో సోమవారం ఉదయం 8 గంటల సమయంలో గురుకుల కళాశాల గేటుకు తాళం వేశారని గురుకుల జోనల్ అధికారిని దృష్టికి తీసుకుపోయి చరవాణి ద్వారా మాట్లాడించడం జరిగిందని వవారం రోజుల్లోగా భవనానికి అద్దె చెల్లించే ఏర్పాట్లు చేస్తామని హామి ఇవ్వడంతో పాఠశాల ముందు గేటుకు వేసిన తాళం ను యజమాని తీశారని ఇంచార్జి ప్రిన్సిపాల్ రామాంజనేయులు ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు.





ఎర్రవల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఐజ గురుకుల కళాశాల

## దేవరకద్రలో అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ చేస్తున్న పెద్ద రాంరెడ్డి కుటుంబ సభ్యులు

**దేవరకద్ర,సెప్టెంబరు30 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరప్పయ్యస్వామి దేవస్థానంలో గత కొన్నేళ్లుగా ప్రతి సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే స్థానికుడైన దివంగత బలుసుపల్లి పెద్దరాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, భారతి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివంగత పెద్ద రాంరెడ్డి, కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



మహిళలకు సాధికారతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల అంగన్‌వాడి కేంద్రం 3లో సోమవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మహిళ సాధికారతపై జిల్లా మహిళా సాధికారత అధికారిణి రేణుక వృద్ధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత అధికారిణి రేణుకతో పాటు అంగన్‌వాడి కార్యకర్తలు ఉప్పునుంతల భార్గవి, పద్మ, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపు విజయవంతం

**ఉప్పునుంతల,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మెడికల్ క్యాంపు విజయవంతం అయింది. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామ పంచాయతీల కార్మికులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మోహన్‌లాల్, స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి స్వప్న, వైద్య సిబ్బంది,మండల పంచాయతీ అధికారి నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఆశా వర్కర్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కోటీలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**కొత్తకోట సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామ స్టేజి సమీపంలోని కోటీలింగేశ్వర ఆలయంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనుజీ దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శివుడికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మంత్రోచ్చారణాలతో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే..





వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో డీడబ్ల్యూఓ, పీబీఎస్ అండర్ మేనేజ్మెంట్ ప్రభుత్వ వృద్ధాశ్రమంలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ భాగ్యమ్మ, సూపర్‌వైజర్లు హజరై వృద్ధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వృద్ధులకు సీడీపీఓ భాగ్యమ్మ పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరు ప్రేమగా మెలుగాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, లక్ష్మి, దేవమ్మ, రషీదా, అరుణ, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ అలివేలు, నిర్వాహకులు పి.వెంకటయ్య, హోం కోఆర్డినేటర్ పద్మమ్మ, అసిస్టెంట్ హోమ్ కోఆర్డినేటర్ పరమేష్, సిబ్బంది, వృద్ధులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయ బృందం

**అమరచింత సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**అమరచింత మండలంలోని మస్తీపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న లావణ్య ,హారిక ,చందులు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా మండల ఎంఈఓ భాస్కర్‌సింగ్ మాట్లాడుతూ,2022,23 సంవత్సరంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మస్తీపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి మొదటి బహుమతి సాధించడం అభినందనీయమన్నారు.విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు సేవాభావంతో ముందుండాలని ఆయన విద్యార్థులను కోరారు. అలాగే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెక్ బుక్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విజయం సాధించిన సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మైక్రో స్కోప్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఎస్ వెంకటన్న అగ్రిప, రాములు,ప్రభాకర్ ,పాండు,నాగరాజ్, రామన్ గౌడ్ జన విజ్ఞాన వేదిక నాయకులు వేనాచారి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

**వీపనగండ్ల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** మండలంలోని వల్లభాపురం తండాకు చెందిన నారాయణ నాయక్ వయసు 55 అనే వ్యక్తి విద్యుత్తు శాఖకు గురై ఉదయం 6:30 ఆ ప్రాంతంలో సోమవారం మరణించినట్లు వీపనగండ్ల ఎస్ఐకె రాణి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం సంగినేనిపల్లి గ్రామానికి చెందిన పెంటయ్య అతని కుమారుడు పరమేష్ భూమిలో ఆదివారం నాడు మొక్కజొన్న పంట వేయడం జరిగిందని ఆ పంట రక్షణ కోసం జంతువుల నుండి కాపాడుకోవడానికి చుట్టుపక్కల రక్షణ కవచంగా విద్యుత్తు తీగలు ఏర్పాటు చేశారు రైతు చేసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. అయితే అది గమనించని వల్లభాపురం తండాకకు చెందిన నారాయణ నాయక్ ఉదయం 6:30 ఆ ప్రాంతంలో ఆ పొలంలో విత్తనాలు వేసిన విషయం తెలియక, రక్షణగా ఏర్పాటుచేసిన విద్యుత్తుతీగలను గమనించకుండా పొలంలో లోపలికి వెళుతున్న అతనికి తీగలు తగిలి మృతి చెందినట్లు విచారణలో తేలిందని ఆమె తెలిపారు. అయితే మృతుని కుంటుంసభ్యులు అతను భార్య దేవమ్మ ఇచ్చున ఫిర్యాదు మేరకు పొలం యజమానులైన పెంటయ్య గొల్ల పరమేష్ అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చి నిర్లక్ష్యం చేయడం జరిగిందని అందుకోసం వారి తండ్రి కొడుకులు ఇద్దరి మీద కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. మృతుని పోస్టుమార్టం కోసం వనపర్తి ఏరియా హాస్పిటల్ కు తీసుకుపోయినట్లు ఆమె తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

**గద్వాల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ గా వి.లక్ష్మినారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృతా జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ బి.యం.సంతోష్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో జిహెచ్ఎంసి, హైదరాబాదులో ల్యాండ్ అక్విజేషన్ విభాగంలో పనిచేసి జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస రావు యధావిధిగా స్పెషల్ డిప్యూటీకలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ వీరభద్రప్ప, కార్యాలయ సిబ్బంది,వివిధశాఖల అధికారులు అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

## ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవించాలి..

**బిజినపల్లి,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** సమాజంలో వయోవృద్ధులకు సముచిత స్థానం కల్పించి గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని మండల ప్రత్యేక అధికారి రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని లూర్దునగర్ కాలనీలోని ప్రశాంత నిలయం వృద్ధాశ్రమంలో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రాజేశ్వరి వృద్ధాశ్రమంలో ఉన్న వయో వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రశాంత నిలయంలో వారికి కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకుని వయోవృద్ధులు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ తరపున పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వయోవృద్ధులను గౌరవించి, వారి సంరక్షణకు కృషిచేసే లక్ష్యంతో వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీరాములు, ఎంపిడిఓ కథలప్ప, పంచాయతీ సెక్రెటరీ మహేష్‌నాయక్, కారోబార్ శ్రీశైలం, ప్రశాంత నిలయం సిబ్బంది మేరీ థామస్, జిమిత ప్రవా బ్రిగేటి తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

**మక్తల్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** సెప్టెంబర్ 29న మక్తల్ మిని స్టేడియంలో నిర్వహించిన షూటింగ్ బాల్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన నారాయణపేట జిల్లా బాలికల జట్టులో... అర్చన, వైశాలి, కావ్య, నవిత (ముదుమాల్), భూమిక, వైశాలి, మనుష, కౌసల్య, ఐశ్వర్య, (గురుకుల సంగంబండ), అఖిల (నేరుడుగాం) కవిత (ముశ్రిఫా),శిరీష,అశ్విని (నర్వ),నింగమ్మ(కున్సి), బాలికల జట్టు కోచ్, మేనేజర్ శ్రీలత, నారాయణపేట బాలుర జట్టులో దుర్గా (గున్ముక్ల), జయదీప్, రాజేష్, ప్రశాంత్, నితిన్, పి. అజయ్ (బాలుర గురుకుల), శివచరణ్, నవదీప (మక్తల్), అరవింద్(ముదుమల్), జగదీశ్వర్ (ముశ్రిఫా), రఘు (కున్సి), ఫర్హాన్ (లిటిల్ ఏంజిల్స్), కోచ్, మేనేజర్ రమేష్‌కుమార్, మహబూబ్‌నగర్ బాలికల జట్టు : దివ్య, విద్యశ్రీ, మేఘన, ప్రవీణ, వైష్ణవి, అక్షయ, లక్ష్మీదేవి, ఆనందిని, భార్గవి, శోభ, శిరీష, వైష్ణవి, కోచ్, మేనేజర్ పీఈటి అనిత, మహబూబ్‌నగర్ బాలుర జట్టు: రవి, రాము, సూర్య, అబ్దుల్ రహిమాన్, సాయితేజ, రామ్‌కుమార్, అజయ్‌సాయి, లోహిత్, దినేష్, అర్జున్, రామ్‌చరణ్, కోచ్, పీఈటీ రమేష్ వీరు ఈనెల 3 నుంచి 5 వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బాల బాలికలను ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన బాల బాలికలు

## ప్రభాకర్‌రెడ్డికి అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా అవార్డు

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** దేశంలో ఫార్మా రంగంలో అకాడమిక్, పరిశోధనలలో చేసిన విశేష సేవలకు గుర్తింపుగా అసోసియేషన్ ఆఫ్ ఎఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా అవార్డు ప్రకటిస్తుంది. గత దశాబ్ద కాలానికి పైగా ఫార్మసి కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న డా.వి. ప్రభాకర్‌రెడ్డికి ఈ అవార్డు లభించింది. ఆయన గతంలో కాలేజీ ఆఫ్ ఫార్మసీకి పదేళ్లుగా ప్రిన్సిపాల్‌గా పని చేసి పిసిఐ గుర్తింపు రావడంలో కృషి చేశారు. ప్రస్తుతం విభాగాధిపతిగా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఫార్మసీలో మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఉత్కల్ యూనివర్సిటీ, భువనేశ్వర్, ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన కార్యక్రమంలో డా.ప్రభాకర్‌రెడ్డికి నిర్వాహకులు అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపల్ డా. నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా. కె.ప్రవీణ, విభాగాధిపతి డా. ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులుగా డా. చిన్నాదేవి, డా.రవికాంత్, డా. ఈశ్వర్‌కుమార్, సోమేశ్, డా.శైలేష్, డా. సురేష్, తరుణ్, సరిత, స్వాతి, సుజాత, శారద, సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు, బాలింతలకు పౌష్టిక అహారంపై అవగాహన సదస్సు..

**గద్వాల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల అర్బన్ గర్భిణీలకు, బాలింతలకు ప్రీస్కూల్ పిల్లలకు పౌష్టిక ఆహారం గురించి సోమవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ బాలనర్సమ్మ అవగాహన కల్పించారు. పౌష్టిక ఆహారం అదనంగా తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ బాల నరసమ్మ వివరించారు. ఇందులో భాగంగా గంజిపేట సెక్టర్ అంగన్వాడి టీచర్లు శైలజ, ఉమలత, ప్రీ స్కూల్ పిల్లలు, ఆయాలు గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేత..

**మూసాపేట,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం కార్యక్రమానికి సంబంధించి అడ్డాకుల మండలం, మూసాపేట మండలాలకు చెందిన లబ్దిదారులకు రెవెన్యూ అధికారులు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్ స్థానిక నాయకులతో కలిసి ధృవీకరణ పత్రాలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కట్టెల పొయ్యిల వద్ద మహిళలు పడుతున్న ఇబ్బందులను చూసి గత ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రూ. 500లకే సిలిండర్ హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అక్క, చెల్లెమ్మలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, మహిళలకు ఇప్పటికే ఉచిత బస్ సౌకర్యం గెలిచిన రెండు రోజులకే అమలు చేయడం జరిగిందని, 200ల యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ తదితర హామీలు నెరవేర్చామని తెలిపారు. ఇప్పటికే 98% రైతులకు రుణాలు మాఫీ చేశామని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు సైతం సమస్యను పరిష్కరించి రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. త్వరలో రైతుబంధు వేస్తామని, అక్టోబర్ నుండి రేషన్ కార్డులు ఇస్తామని, దసరా నుండి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, త్వరలో క్వింటాల్ వరికి రూ. 500ల బోనస్ ఇస్తామని, జనవరిలో రేషన్ ద్వారా సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయినప్పుడు రూ. 69 వేల కోట్ల అప్పు ఉంటే పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ నాయకులు ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని, గత ప్రభుత్వం 5 వేల కోట్ల రూపాయల వడ్డి కడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేస్తుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ పొందిన నాలుగు రోజుల్లో రాయితీ నగదు జమ కాకపోతే వివరాల కోసం 1967, 1800425003 33 నంబర్‌లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని కోరారు. అనంతరం అడ్డాకుల,మూసాపేట మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, రైతుభీమా, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణయ్య, బగ్గి కృష్ణయ్య, మాజీ జడ్పీటిసి బాలనరసింహులు, రామన్‌గౌడ్, మాజీ ఎంపిటిసి సంతోష, గోవర్ధన్, చక్రాపూర్ లక్ష్మీనారాయణ, రాధిక, నిజామాబాద్ రాంచందర్ పాల్గొన్నారు.



మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

# ఘనంగా మాజీ మాజీ ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలు

**కొత్తకోట సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బిఆర్ఎస్ మండల, పట్టణపార్టీ ఆధ్వర్యంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆ తర్వాత బాణా సంచాలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ వామన్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్,వైస్ చైర్మన్ బీసం జయమ్మ, పామాపురం సింగిల్ విండో చైర్మన్ వాసుదేవా రెడ్డి, మాజీ ఎంపిపి గుంత మౌనిక మల్లేష్, మాజీ జడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్, మాజీ సీడిసి చైర్మన్ బీసం చెన్నకేశవ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బాబురెడ్డి, ఉమ్మడి జిల్లాల బిఆర్ఎస్ అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్,పట్టణ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి బంగారయ్యలు మున్సిపల్ కౌన్సిలర్లు సంధ్య రవీందర్ రెడ్డి, ఖాజామైనొద్దిన్, రాములు యాదవ్, పద్మ అయ్యన్న,పండ్ల రాములు, నెహ్రు, శ్రీనుజీ, బాలకృష్ణ రెడ్డి, జగన్,ఆకుల శ్రీను, నాగేష్, శ్రీనివాస రెడ్డి, ఆశన్న, హోటల్ రాజు, రవీందర్ గౌడ్,కుర్మయ్య, బాబు,డీకే లక్ష్మణ్, చిన్న నర్సింహ ,కో ఆప్షన్ సభ్యులు,సింగల్ విండోడైరెక్టర్లు, మాజీ మార్కెట్ డైరెక్టర్లు, మాజీ కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్లు, బిఆర్ఎస్ శ్రేణులు, బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మూసాపేటలో..**మండలపరిధిలోని వేముల స్టేజీ హనుమాన్ టెంపుల్ దగ్గర దేవరకద్ర నియోజకవర్గ బిఆర్ఎస్‌పార్టీ మాజీఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమాన్ టెంపుల్ దగ్గర ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్‌చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో మూసాపేట మండల మాజీ జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్,బిఆర్ఎస్‌పార్టీ మండలఅధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, మాజీ ఎంపిపి గుంపాని కళవతి కొండల్, అచ్చయ్యపల్లి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, రవిందర్‌గౌడ్, యాసిన్‌పాషా, తిమ్మాపూర్‌రెడ్డి రాజు, జానంపేట మాజీ ఎంపిటిసి నక్క ఆంజనేయులు, వివిధ గ్రామాల మాజీసర్పంచ్‌లు రఘురాములు, ఉపసర్పంచ్‌లు వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

# పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్

### మధును అభినందించిన రిజిస్ట్రార్, అధ్యాపకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో గణితశాస్త్రం విభాగంలో గత దశాబ్ద కాలంగా అధ్యాపకుడిగా పని చేస్తున్న మోటమారి మధు మహాత్మాగాంధి విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. డా. మద్దిలేటి పసుపుల పర్యవేక్షణలో న్యూమెరికల్ అప్రోచ్ ఆఫ్ హీట్ ట్రాన్స్‌ఫర్ ఎఫెక్ట్స్ ఆన్ కాసన్ నానో ఫ్లుయిడ్ మోషన్ వయా స్ట్రెచింగ్ షీట్ (స్ట్రెచింగ్ షీట్ ద్వారా క్యాసన్ నానో ఫ్లూయిడ్ మోషన్‌పై ఉష్ణ బదిలీ ప్రభావాల సంఖ్యా విధానం) అనే అంశంపై తీసిస్ సమర్పించారు. ఈయన తల్లిదండ్రులు బాలకిష్టమ్మ స్వామిదాస్. ఈయన స్వగ్రామము, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్ మండలము నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందినవవారు, వ్యవసాయ కుటుంబం. ఈయన విద్యాభ్యాసం పదవ తరగతి వరకు అమ్రాబాదులోని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్, డిగ్రీ, అచ్చంపేట పట్టణంలో పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో గణిత శాస్త్రంలో పిజి చేస్తూనే ద్వితీయ సంవత్సరంలోనే సెట్, గేటులో అర్హత సాధించాడు. 2019లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డి అడ్మిషన్ పొందారు. ఈయన గతంలో పియూలో గణిత శాస్త్ర విభాగాధిపతిగా పనిచేశారు. ఈయన చేసిన పరిశోధనా పత్రాలు పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పలు సదస్సులలో పత్ర సమర్పణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి మధుని అభినందిస్తూ, విస్తృతంగా పరిశోధన చేయడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించ్చని అన్నారు. డా. మధు మాట్లాడుతూ సుదీర్ఘ ప్రయాణంలో నాతోదున్న నాగురువులకు, తల్లిదండ్రులకు,అధ్యాపకులకు,మిత్రులకు,ఆయనభార్య భారతికి ధన్య వాదాలు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. చంద్రకిరణ్, డా. రవికుమార్, డా. భూమయ్య, డా.రవిందర్‌రెడ్డి, సురేష్, డా. వెంకటేష్, డా.జంగం విశ్వనాథ్, డా.బషీర్ అహ్మద్, డా. సోమేశ్వర్, డా. రవికాంత్, డా. ఈశ్వర్, సోమేశ్వర్, డా. గురుస్వామి పాల్గొన్నారు.



మధును అభినందిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపక బృందం

# యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలి..

### - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి...

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కల్వకుర్తి నూతన మార్కెట్ కమిటీలోల యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలని, కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్‌గౌడ్‌తో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అనిల్‌గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్లుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రతిపక్షంలో ఉంటూ అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించామని, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ పిలుపు కార్యక్రమాలను నిర్వహించడమే గాక అనే క ప్రజా సమస్యలపై పోరాటం నిర్వహించామన్నారు. ఎన్నో కేసులు, ఎన్నో ఇబ్బందులు గురి చేసిన పార్టీ జెండా మోసామని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని, వారికి వివిధ స్థానాల్లో సముచిత స్థానం కల్పిస్తామని తెలియజేశారని గుర్తు చేశారు. కల్వకుర్తి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ నియామకాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు.ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన వారిలో మండల అధ్యక్షులు బీస బాలరాజు, రాజశేఖర్,, నాయకులు వస్పుల శ్రీకాంత్, జావేద్, పర్మపాకుల రమేష్, రమేష్‌గౌడ్, గొడుగు శ్రీశైలం తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**మూసాపేట,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని వేముల స్టేజీ దగ్గర ఆదర్శ మహిళా సంఘం భవనంలో సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సమక్షంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మిల్క్ పార్లర్ల నిర్వహణ బాధ్యతలను తమ ప్రభుత్వం ఐకెపికి అప్పగించి, అంతేకాక పాఠశాలలను పునరుద్ధరించేందుకు తలపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సైతం డ్వాక్రా సంఘాలకే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందని, ఔత్సాహిక మహిళలు తమ ఉత్పత్తులను వవిక్రయించేందుకు శిల్పారామంలో ఉచితంగా ప్రత్యేక స్టాల్స్ సైతం ఏర్పాటు చేశామని, స్కూల్ యూనిఫామ్‌లను కుట్టు బాధ్యతలు తదితర అన్ని రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం ఇస్తూ, మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు తీసుకుని వ్యాపార రంగంలో అగ్రస్థానాలలో మహిళలు ముందుండాలన్నారు.కార్యక్రమంలో పిఆర్‌డిఓ నరసింహులు, అడిషనల్ జ్యోతప్ప, డిపిఎం చెన్నయ్య, ఏపిఎం వెంకటాచారి,టిసిలు శ్రీనివాసులు,నాగమణి,ఆయాగ్రామాల మహిళా సంఘం సభ్యులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టి చంద్రశేఖర్,మండల యూత్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సుదిరెడ్డి,లక్ష్మీకాంతరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# ఈత వనాలను పెంచాలని ఎమ్మెల్యేకి గౌడ సంఘం సభ్యుల వినతి

**మూసాపేట,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా ఈత వనాలను పెంచాలని మండల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం నాయకులు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అక్కడే ఉన్న కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రతి గ్రామంలో ఈత వనాలు పెంచేలా చూడాలని ఎమ్మెల్యే కోరడంతో స్పందించిన కలెక్టర్ సంబంధిత డిఆర్‌డిఏ పిడి ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతలో ఈ రెండు రోజుల్లో దాదాపు 3 వేల ఈత మొక్కలను నాటేలా చూస్తానని టిఆర్‌టిఏ పిడి చెప్పారు. ఈ వనాలను పెంచడం వల్ల గ్రామంలో కల్తీ లేని కల్లును విక్రయించడానికి వీలవుతుందని మండల గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రభుత్వం ద్వారా 3 వేల ఈత మొక్కలను అందిస్తున్నందుకు ఎమ్మెల్యేకు మండల గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఈత మొక్కలను నాటడం జరుగుతుందని మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు రామన్‌గౌడ్, నల్ల తిరుపతయ్యగౌడ్, మండల అధ్యక్షుడు శశిధర్‌గౌడ్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు సంపత్‌కుమార్‌గౌడ్, వెంకటరాములుగౌడ్, భీమయ్యగౌడ్, గణేష్‌గౌడ్ ఉన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కర్ని విద్యార్థిని

**మక్తల్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.శశిరేఖ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల జిహెచ్ఎం వెంకటయ్యగౌడ్, పిడి బి.రూప తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా ఖోఖో జట్టు తరపున సెప్టెంబర్ 13నుండి 15వరకు హైదరాబాద్ మౌలాలిలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలలో పాల్గొన్న వై.శశిరేఖ అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి మూడోస్థానం పొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 4 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని సిండేగాలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీల్లో వై. శశిరేఖ పాల్గొంటారన్నారు. ఆమెను సోమవారం విశ్రాంత పీఈటీ బి. గోపాలం, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ ప్రజలు అభినందించారు.



## టీ సార్ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ఉప్పునుంతల,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర టీ సార్ట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో నల్లమల ప్రాంతం వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాంపిటీటివ్ ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. టిసార్ట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డిని సన్మానించిన వారిలో కాంగ్రెస్ యువ నాయకులు, కంసానిపల్లి గ్రామానికి చెందిన కట్టా అచ్యుతారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెల్టూరి రేణయ్య, కొట్టె శ్రీనివాస్, వెల్టూరి భాస్కర్, చెన్నకేశవ్, ఆనంద్, శ్రీకాంత్, శేఖర్, కురుమయ్య, బాలరాజు, జెఎస్ కె. లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హీ సేవపై అవగాహన ర్యాలీ

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని మున్సిపాలిటి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బస్టాండ్ కూరగాయాల, మార్కెట్ రోడ్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ మహబూబ్ షేక్‌లు మాట్లాడుతూ స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపాలిటి ప్రజలు స్వచ్ఛతపై వార్డుల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎనిర్వాన్మెంట్ ఇంజనీర్ ఆర్.శివ, మున్సిపాలిటి సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## తిరుమల లడ్డు పవిత్రతను కాపాడండి

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర దేవాలయంలో లడ్డు ప్రసాదం అపవిత్రతకు కారణమైన వారిని గుర్తించి శిక్షించాలని అలాగే తిరుమల లడ్డు పవిత్రతను కాపాడాలంటూ విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నిరసన ర్యాలీలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి నిరసన ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీ మండల తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ మండల డిప్యూటి తహసిల్దార్ చంద్రశేఖర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ శంకరయ్య, నంబిరాజు, ఎస్. వెంకటేష్, ఎస్. రమేష్, వికాస్ నరసింహ, బొజ్జన్న, కటికె నారాయణజీ, హోటల్ మధు, ఆకుల అంజన్న పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన మునుగాల గ్రామ నాయకులు

**ఇటిక్యాల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ఏఐసీసీ కార్యదర్శి చత్తీస్ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ని సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా మండల పరిధిలోని మునగాల గ్రామ నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణ రెడ్డి గ్రామ ప్రజలు కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ సమస్యలను మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందని అలాగే గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ ముఖ్య నాయకుడు లక్ష్మీనారాయణ రెడ్డి, తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్, చాంద్, భాషా తదితరులు ఉన్నారు.

## జోగులాంబ దేవీ శరన్న వరాత్రులకు మంత్రి జూపల్లికి ఆహ్వానం...

**గద్వాల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుండి 12 వ తేదీ వరకు జరిగే శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాలను రావాలని ఆలయ, ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు, ఉత్సవాల్లో భాగంగా భక్తులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఈవో ను ఆదేశించారు.

## జర్నలిస్టుల రాయితీ బస్‌పాస్‌ల గడువు 3 నెలలు పొడగింపు..

**గద్వాల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టుల రాయితీ బసఖ పాసుల గడువును మరో మూడు నెలలు అక్టోబర్ నుండి డిసెంబర్ 2024 వరకు పొడిగించినందున గతంలో మాదిరిగానే సమీపంలోని బాస్ పాస్ సెంటర్లకు వెళ్లి తమ అక్రిడిటేషన్ కార్డు, పాత బస్ పాస్ చూపించి, జర్నలిస్టులు తమ బస్ పాస్‌లను రెన్యూవల్ చేసుకోవాలని తెలియజేయడమైనది, అలాగే డి పి ఆర్ ఓ కార్యాలయంలో తమ అక్రిడేషన్ కార్డు పై ఎక్స్టెన్షన్ స్టిక్కర్ వేయించుకోగలరని తెలుపనైనది.

## గిరిజన మహిళలకు డాక్టరేట్..

### లంబాడ విద్యార్థులపై పరిశోధన

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** పాలమూరు విశ్వవిద్యాలయంలో గత ఎనిమిది సంవత్సరాలుగా అధ్యాపకురాలుగా సేవలందిస్తున్న జయనాయక్ అకాడమిక్ యాంగ్జైటీ, సెల్ఫ్ ఎఫికెసి ఆఫ్ ట్రైబల్ (లంబాడ)స్టూడెంట్స్ ఇన్ లర్నింగ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అనే అంశంపై ప్రొ॥ మేరి సునంద పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను డా.బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు జయనాయక్‌కు అత్యున్నత డాక్టరేట్ డిగ్రీ అవార్డు అందజేశారు. జయనాయక్ ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలోని పూర్తిచేసి, పాలమూరు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ ఇంగ్లీష్, ఎంఎడ్ పూర్తిచేసి 2016 నుండి ఇదే పాలమూరు విశ్వవిద్యాలయంలో నానమ్మ చంద్రమ్మ ఆశయాలకు అనుగుణంగా అధ్యాపకురాలిగా సేవలందిస్తూ డా.బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుండి సైకాలజీలో కూడా పీజీ పూర్తి చేశారు. విద్య విభాగంలో నెట్ పరీక్ష కూడా ఉత్తీర్ణత సాధించారు. పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి తండాకు చెందిన మణెమ్మ, శంకర్‌ల ఏకైక పుత్రిక అట్టడుగు నుంచి ఉన్నత స్థాయి విద్యను పూర్తి చేసినందుకు తల్లిదండ్రులు, భర్త శ్రీనివాస్ నాయక్ ఎంతో సహకరించారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. మదుసూదన్‌రెడ్డి అభినందిస్తూ ఇక్కడే ఎంఎడ్ పూర్తిచేసి, త్వరగా పిహెచ్‌డి అవార్డు పొందిన సందర్భంగా విశ్వ విద్యాలయం పరిశోధనలను చాలలా ప్రోత్సహిస్తుందని ఇంకా మంచి మంచి పరిశోధన గ్రంథాలు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జయనాయక్‌ను ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొ॥ నరసింహులు, విద్యా కళాశాల ప్రిన్సిపల్ డా. బషీర్ అహ్మద్, డా. జంగం విశ్వనాథ్, తోటి అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు సత్కరించి సన్మానించారు.

## ఘనంగా బాబుగురుస్వామి వర్ధంతి వేడుకలు

**దేవరకద్ర,సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** లాల్‌కోటలో సోమవారం స్వర్గీయ శ్రీ బాబుగురుస్వామి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామ అయ్యప్ప సేవా సమితి, గోవర్దన్‌చారి గురుస్వామి ప్రియశిష్యుడు లాల్‌కోట కెంగూరి అంజన్నయాదవ్‌ల సంయుక్త అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం వద్ద భక్తులను అన్నప్రసాదవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి గోవర్దన్‌చారి గురుస్వామి ప్రియశిష్యుడు లాల్‌కోట కెంగూరి అంజన్నయాదవ్ మాట్లాడుతూ ఎందరికో అయ్యప్పమాలలు ధరించి అందరిని మంచి మార్గంలో నడిపించిన మహామనిషి బాబుగురుస్వామి అని అన్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు,స్వామి శిష్యులు,భక్తులు,గ్రామస్థులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యధిక పనిదినాలు కల్పించడం

## కోసం పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

### అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీలకు 2025-26 సంవత్సరంలో అత్యధిక పనిదినాలు కల్పించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ,జిల్లా పరిషత్, మండల అభివృద్ధి అధికారులు,ఎపీఓ లతో సమావేశం నిర్వహించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 సంవత్సరానికి పనుల ఎంపికకు తయారు చేయవలసిన ప్రణాళిక, తయారులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,పనుల ఎంపిక గ్రామ సభల నిర్వహణపై అదనపు కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ఉమాదేవి, జెడ్పిసిఈఓ యాదయ్య, అడిషనల్ డిఆర్‌డిఓ రామ మహేశ్వర్ రెడ్డి,ఎంపీడీఓలు, ఏపీఓలు, ఈఓలు, టీఏలు,ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

## వెల్దండ బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమం

**వెల్దండ, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గప్రసాద్ హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రజలు నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారని, స్వచ్ఛందంగా బీజేపీలో సభ్యత్వ నమోదును ఉత్సాహం చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, సీఎం రేవంత్‌రెడ్డి 9 నెలల పాలనలో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తపరుస్తున్నారన్నారు. సభ్యత్వనమోదు కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగయ్యయాదవ్, రామకృష్ణ, నీలకంఠం రవి, దశరథం, శ్రీశైలం, గెల్వయ్య, శివప్రసాద్, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

**గద్వాల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూగా. వి లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృతి జిల్లా కార్యాలయాలు సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ బి.యం సంతోష్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకుముందు బిహెచ్ఎంసి, హైదరాబాదులో ల్యాండ్ అక్విజేషన్ విభాగంలో పనిచేసి జిల్లాకు అదనపు కలెక్టర్ గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసరావు యధావిధిగా స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్ గా బాధ్యతలు నిర్వహిస్తారు. కలెక్టరేట్ ఏ.ఓ వీరభద్రప్ప కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి..

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** జిల్లా ప్రజావాణి ఫిర్యాదులతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం ఉదయం అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్ తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై ముఖ్యమంత్రి ప్రజావాణి లో చేసుకున్న ఫిర్యాదులను అక్టోబర్,3 నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి నుండి జిల్లాకు ఇప్పటి వరకు ఆయా శాఖలకు పంబంధించిన 297 ఫిర్యాదులు రావడం జరిగిందని, వాటిని సంబంధిత శాఖలకు పంపించగా ఇప్పటి వరకు 114 ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయని ఇంకా 183 ఫిర్యాదులు ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలియజేశారు. ఎక్కువగా రెవెన్యూ శాఖలో పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు.ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడమే కాకుండా ఫిర్యాదు దారుని మనోభావాలు, స్పందనను సమర్పించాల్సిందిగా సూచించారు. అదేవిధంగా జిల్లా ప్రజావాణి ఫిర్యాదులను సైతం ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సోమవారం మొత్తం 55 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా అధికారులు , మండలాల నుండి వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు ,ఎంపీడీఓ లు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎక్కడ విద్యుత్ సమస్యలు

## తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే

**కల్వకుర్తి,సెప్టెంబర్30 ప్రభాతవార్త:**నియోజకవర్గంలో ఎక్కడ కూడా విద్యుత్‌సమస్యలు తలెత్తకుండాచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అన్ని మండలాల విద్యుత్ శాఖ అధికారులు ఏడీ, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా కోసం మెటీరియల్, లైన్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. వర్షకాలం గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద ఎక్కడెక్కడ యేయే సమస్యలు ఉన్నాయో వివరాలను విద్యుత్ అధికారులతో సమీక్షలో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల హైదరాబాద్‌లో విద్యుత్ సీఎండీని కలిసి నియోజకవర్గానికి కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించాలని, అవసరమైన మెటీరియల్స్‌ను కావాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమావేశంలో కల్వకుర్తి ఎండీ చంద్రశేఖర్, ఆమనగల్లు ఎండీ శ్రీనివాసులు, కల్వకుర్తి ఏఈ శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

## పాలమూరు రూరల్

## మండల బిజెవైఎం కమిటి ఎన్నిక

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెవైఎం పాలమూరురూరల్ మండల నూతన కమిటిని బిజెవైఎం మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి, బిజెపి రూరల్ మండల అధ్యక్షులు రాజుజుగౌడ్ పాల్గొన్నారు. బిజెవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా హన్మంతు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ఆర్. నరేష్, విష్ణుకుమార్, మల్లేష్, కార్యదర్శులుగా రఘురాథోడ్, రామచందర్, దొడ్డెన ఆంజనేయులు, నరేష్, రవిందర్, కోశాధికారిగా ఆంజనేయులు, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి దేశం మహేష్‌గౌడ్, బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నరేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కె. చంద్రశేఖర్, టౌన్ అధ్యక్షులు శివ, మండల కిసాన్‌మోర్చా అధ్యక్షులు రాఘవేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు సవారి సత్యం పాల్గొన్నారు.

# దసరా తర్వాత ఇందిరమ్మ ఇళ్లు..

- రైతు బిడ్డగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నందుకు గర్విస్తున్నా..
- 7లక్షల కోట్ల అప్పుల మిగిల్చిన బీఆర్ఎస్ ..
- భూత్పూర్‌లో మహాలక్ష్మి పథకంలో రు.500ల సబ్సిడీ మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్..



భూత్పూర్‌లో సబ్సిడీ గ్యాస్ సిలెండర్ల మంజూరు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త :** ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అంచెలంచెలుగా అమలు చేస్తున్నారని,ప్రభుత్వం దసరా తర్వాత అర్హులైన ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు.సోమవారం సాయంత్రం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో మంజూరు చేసిన రు.500లకే సిలెండర్లను పంపిణీ చేశారు.భూత్పూర్ మండలంలో 4800,భూత్పూర్ పట్టణంలో 1500ల మంది మొత్తం 6300 మందికి రు.500లకే సిలెండర్ల మంజూరు పత్రాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ అంద జేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీలలో దాదాపు నాల్గింటిని పూర్తి చేసినట్లు చెప్పారు.పదేళ్ల పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు.2014లో 60వేల కోట్లు అప్పుగా ఉన్న రాష్ట్రాన్ని 2023నాటికి 7లక్షల కోట్లకు చేర్చిందని,కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట వేల కోట్ల కమిషన్లు మింగి గత సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నెల నెలా 5వేల కోట్ల వడ్డీ కడుతోందని ఆరోపించారు.సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కేవలం 28రోజుల్లోనే 18వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు కదిరే శేఖర్‌రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరవింద్,మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు హరియా నాయక్, మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు నర్సింహులు,పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పద్మ ప్రసంగించారు.పట్టణ మున్సిపాలిటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి,తహశిల్దార్ ఎంఎ రహమాన్, ఎంపీడీఓ ప్రభాకర్‌చారితో పాటు మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్,కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, అన్వర్‌పాష, సంజీవరెడ్డి, మంగలి వెంకటనారాయణ, యాదయ్య(జగన్),దెంది లక్ష్మికాంత్‌రెడ్డి,కోరె పవన్,తమ్మన్నగౌడ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలి

### సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సమాచార రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం పేట జిల్లా కేంద్రంలో సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు కలదు, సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కొరకు దరఖాస్తుదారులు వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా 30 రోజులు ఇవ్వవలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచిన ఎలాంటి సమాచారం ఇవ్వకపోతే సెక్షన్ 19 (1) ప్రకారం మొదటి అప్పీల్ కూడా సమాచారం ఇవ్వట్లేదని అలాగే సెక్షన్ 19 (3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్‌లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బిసి సంఘం ప్రధాన కార్యదర్శి రిషికుమార్ ముదిరాజ్, ఆర్టీఐ పిసి జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ యాదవ్,నారాయణపేట జిల్లా ఇంఛార్జి ఎడ్ల కుర్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పతంగి చిన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పేట అసెంబ్లీ అధ్యక్షుడు గణేష్, మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు గోపాల్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, అసెంబ్లీ కమిటి సభ్యులు సంద కృష్ణ, వెంకటన్న, మురళి, రవినాయక్ పాల్గొన్నారు.

# రక్తదానం మహాదానం..

### నిరంతర రక్తదాత నవదీప్ : పదిసార్లు రక్తదానం చేసిన వైద్య విద్యార్థి

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** వైద్య విద్యార్థిగా రక్తదాన ప్రాధాన్యతను గుర్తించిన అశ్విని నవదీప్ నిరంతరం రక్తదానం చేస్తూ యువతకు స్ఫూర్తి నిలుస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ మెడికల్ కళాశాలలో యంబిబిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అశ్విని నవదీప్ 2020లో నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన నాటి నుంచి ఇప్పటి వరకు వరుసగా పదిసార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పాటు రక్తదాన ఆవశ్యకతపై యువతకు అవగాహన కల్పించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులు, యువకులతో భారీ స్థాయిలో రక్తదానం చేయించారు. హనుమకొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ముఖ్యంగా గత జూన్ 14న జరిగిన ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా 400ల మంది వైద్య విద్యార్థులతో రక్తదాన శిబిరం నిర్వహించి రికార్డు సృష్టించి అధికారుల మన్ననలు అందుకున్నారు. అంతేకాకుండా అవ్యవసర పరిస్థితుల్లో కూడా అవసరమైన వారికి రక్తం అందించడంలో నవదీప్ తనవంతు సహాయం అందిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. అనేకసార్లు రక్తదానం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్న నవదీప్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌లు, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని యువతకు నవదీప్ పిలుపునిచ్చారు.

# విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి:వైస్ చైర్మన్

**తెల్కపల్లి,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్లో స్వేరోస్ విస్తం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులందరూ శ్రద్ధతో చదివి, మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యతోనే పేదరికం తొలగించవచ్చని సూచించారు. నాగర్‌కర్నూల్ స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ అసెంబ్లీలో 5 మండలాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించగా సుమారు 200ల మందికి పైగా విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని ఈ పోటీలో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ మొదటిబహుమతి తెల్కపల్లి మండలానికి చెందిన ప్రావుణ్య మొదటిబహుమతి గెలుపొందగా,ద్వితీయ బహుమతి భరణి, తృతీయ బహుమతి కెరలిన్, నాగర్‌కర్నూల్‌కి చెందిన రోషన్ బహుమతులను గెలుచుకున్నారని తెలిపారు. బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.కార్యక్రమంలో శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ సురేందర్, ప్రిన్సిపల్ దీప, సెబాస్టియన్, ఉపాధ్యాయులు పరశురాములు,రమేష్,తిరుపతయ్య,వెంకటేష్,స్వేరోనాయకులు సంపత్‌కుమార్, మబ్బు రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

# యాపర్ల గ్రామంలో బడి నిద్ర కార్యక్రమం..

**పెబ్బేరు సెప్టెంబర్30 ప్రభాతవార్త:**పెబ్బేరుమండలం యాపర్లగ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం గ్రామంలో సోమవారం బడినిద్ర కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్, ఉపాధ్యాయులు మైనోద్దిన్,ఈశ్వర్‌రెడ్డి,శ్రీధర్,వెంకటేశ్వర్లు రాత్రి 7 గంటల నుంచి గ్రామంలో ని విద్యార్థుల ఇళ్లనే సందర్శించి విద్యార్థుల చదువు గురించి వివరించారు.పేరెంట్స్ మీటింగ్ నిర్వహించిన సమయంలో అందరు తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి మాట్లాడటం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సమావేశంలో తల్లిదండ్రులు హాజరు కావటం లేదని, ఉపాధ్యాయుల అభిప్రాయం ప్రకారం బడి నిద్ర కార్యక్రమం చేద్దామని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇంటి దగ్గర హోమ్ వర్క్ చేయించాలని, సమ్మేటీవ్ 1పరీక్షలకు విద్యార్థులు బాగా చదవవాలని, తల్లిదండ్రులకు ఉన్న చెడ్డ అలవాట్లను పిల్లలు చేపట్టకూడదని, సిగరేట్, మందు లాంటివి తీసుకురామనడం పిల్లలకి చెప్పకూడదని చెప్పారు. స్టూడెంట్స్ కు సెపరేట్ స్టడీ కార్నర్ ఏర్పాటు చేయ్యాలని,సెల్ ఫోన్,టీవీకి దూరంగా ఉంచాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో కూడా గడపాలన్నారు. ఈ కార్యక్రమం చూసి తల్లిదండ్రులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్వరాజ్యం బాబు రెడ్డి, పెద్దలు పాల్గొన్నారు.

# ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు:సిఐ రవిందర్

**లింగాల,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** లింగాల మండల కేంద్రంలోని ధారాం రోడ్డుకు కొంత దూరంలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం లింగాలకు చెందిన ఆంగోత్ దేవేందర్ (22)గా గుర్తించినట్లు సిఐ రవిందర్ సోమవారం తెలిపారు. సిఐ రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం గత మూడు రోజుల క్రితం మండల కేంద్రం సమీపంలోని రోడ్డుకు కొంత దూరంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు సిఐ తెలిపారు. మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా లింగాలకు చెందిన ఆంగోత్ దేవేందర్‌గా గుర్తించినట్లు సిఐ తెలిపారు. లింగాలకు చెందిన కంప లింగస్వామి, ఉలస్ శంకర్ అనే రైతులు తన మొక్కజొన్న పంటను పందుల బెడద నుండి పంటను రక్షించుకోవడానికి విద్యుత్ కంచెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మృతుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ రవిందర్ తెలిపారు. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం అనంతరం మృతుని కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. మృతుని తల్లి సోమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ రవిందర్ తెలిపారు.

## డీఎస్సీలో కల్వరాళ్లకు

# ర్యాంకుల పంట

**వీపనగండ్ల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**వీపనగండ్ల మండలం లోని కల్వరాళ్ల గ్రామానికి చెందిన వ్యక్తులకు డీఎస్సీలో ర్యాంకుల పంట పండింది. సోమ వారం నాడు వెలువడిన డీఎస్సీలో కల్వరాళ్ల గ్రామానికి చెందిన రవికుమార్ ఫస్ట్ ర్యాంకు ఫిజికల్ సైన్స్‌లో సాధించి ఉద్యోగ ర్యాంకు లో ఫస్ట్ ఉన్నట్లు తెలిసింది. ఆయనతోపాటు సుస్మిత అదే గ్రామానికి చెందిన అమ్మాయి 14వ ర్యాంకు సాధించి ఉద్యోగ అర్హతను పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉంటే గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రభుత్వం ఏ ఉద్యోగాల నియామకాలు చేపట్టిన వారు ఎదో ఒక ఉద్యోగంలో వారి ప్రతిభను కనబరిచి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అక్కడి ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులుగా గాల్‌రెడ్డి తదితరులు తెలిపారు.





### జిల్లాలో ఎస్జీటీలో 2వ ర్యాంకు సాధించిన హసీనా



**ఇటిక్యాల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేసిన డీఎస్సీ ఫలితాలలో ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన పింజరి హసీనా ఎస్‌జిటి పోస్టు లో 79.43 మార్కులు సాధించి జోగులాంబ జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. డీఎస్సీ ఫలితాలలో జిల్లా స్థాయిలో 2వర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు అభినందించారు.

## డీఎస్సీ ఫలితాలలో జిల్లా ఫస్ట్

## ర్యాంకర్‌గా కుటకనూర్ వాసి

**అయిజ సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుట్కూరు గ్రామానికి చెందిన కే.శ్రీనివాసులు సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలలో జోగులాంబ గద్వాల జిల్లా ఫస్ట్ ర్యాంకర్ గా నిలిచి హిందీ పండితులుగా ఉద్యోగం సాధించినట్లు వారు తెలిపారు. దీంతో జిల్లా ఫస్ట్ ర్యాంకర్‌గా మండలానికి చెందిన వ్యక్తి కి రావడంతో మండల నాయకులతో పాటు గ్రామస్తులు ఆయన అభినందించారు.



## డీఎస్సీ ఫలితాల్లో

## కానాయపల్లి విద్యార్థి జిల్లా ఫస్ట్

**కొత్తకోట సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన జి లక్ష్మి వనపర్తి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఫలితాల్లో 81.10 స్కోర్ ,చేసి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.





అలాగే కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన రమేష్ యాదవ్ కూడడా జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్ సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడంపట్ల ఇరు గ్రామాలలో నాయకులు అభినందించారు.

## మార్కెట్ శాఖ డైరెక్టర్‌ని

## కలిసిన మార్కెట్ చైర్మన్ , వైస్ చైర్మన్

### అలంపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం సహకరించాలి

**ఇటిక్యాల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** అలంపూర్ చౌరస్తాలో గల మార్కెట్ యార్డు మరింత అభివృద్ధి కోసం సహకరించాలని సోమవారం హైదరాబాదులోని కార్యాలయంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని మర్యాదపూర్వకంగా అలంపూర్ నూతన మార్కెట్ యార్డు చైర్మన్, దొడ్డప్ప, వైస్‌చైర్మన్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అల్లంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరిస్తానని మా విజ్ఞప్తిని సానుకూలంగా స్పందించినటఉ్ల చైర్మన్, దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్ తెలిపారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ కూడలిలో మాజీ ఎమ్మెల్యే జన్మదిన కేక్‌ను మాజీ జడ్పీటిసి వట్టెంరాజేశ్వరి రాము,మాజీసర్పంచ్ మోహన్‌గౌడ్, బిఆర్ఎస్ మండలఅధ్యక్షులు కోటరాము ఆధ్వర్యంలో కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఉంద్యాలగ్రామంలో మండల యువజన విభాగంఅధ్యక్షులు బండారిమహిపాల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అరటి పండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో

## నిందితునికి 4 సంవత్సరాలు జైలు శిక్ష

**పాన్‌గల్ సెప్టెంబర్30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేతేపల్లి గ్రామానికి చెందినగాలి గళ్ళ మునిస్వామి,అతని భార్య మైబుసమ్మలపై దాడి, హత్యాయత్నం సంఘటన కేసులో నౌసల్ల శేఖర్ కు 4సంవత్సరాలు జైలుశిక్ష వెయ్యిరూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గత 7నెలలకిందట తమ ఇంటిముందర ఖాళీ స్థలం లోని సంపు విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతూ ఉంది కాగా పాతకక్షలు మనసులో ఉంచుకుని నిందితుడు గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడగా అట్టి కేసులో నేడు కోర్టు వెలువరిచిన తీర్పులో నిందితునికి జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

## భక్తులకు మంచినీటి

## సమస్య రాకుండా చూస్తాం :ఎస్ఈ

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** త్వరలో ప్రారంభం కానున్న శ్రీ కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మంచినీటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ఎస్ఈ జగదీశ్వర్ తెలిపారు. సోమవారం జాతర మైదానంలో సంపు ఏర్పాటుకు గాను స్థల పరిశీలన చేశారు. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ నిధుల నుంచి మంచినీటికోసం రూ. 34 లక్షల నిధులు మంజూరు కాగా ఈ నిధులతో జాతర మైదానంలో పైప్‌లైన్లతో పాటు సంపును ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎస్ఈ తెలిపారు. ఎస్ఈ వెంట ఏఈ రాజు, దేవస్థాన సిబ్బంది ఉన్నారు.

## రైతులు వరిని సింగిల్

## విండో ద్వారానే అమ్మితే బోనస్..

### -సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి

**భూత్పూర్,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త :** రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని సింగిల్ విండో ద్వారానే అమ్మితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రు.500 వర్తిసుందని సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జరిగిన సింగిల్ విండో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సారి తమ సొసైటీకి వరి కొనుగోలు ద్వారా లాభాలు వచ్చాయని పేర్కొన్నారు.సింగిల్ విండో కార్యాలయ సొంత భవనాల నిర్మాణం కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు.అందుకోసం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు,మాజీ సర్పంచులతో పాటు పీఏసీఎస్ జిల్లా మానిటరింగ్ అధికారి వేణుగోపాల్,ఏఆర్ కార్యదర్శి రత్నయ్య ఇతర సిబ్బంధి పాల్గొన్నారు.

## మెడికల్ సీట్ సాధించిన

## వీపనగండ్లకు చెందిన విద్యార్థులు

**వీపనగండ్ల సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు దయ్యపు అచల్, మునికొండ అచల , మేడిపల్లి యామిని రెడ్డి, మెడికల్ సీట్లు సాధించారు వారు మెడికల్ సీట్లో ర్యాంకులను గత రెండు నెలల కిందట ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది. అయితే సోమవారం నాడు వీరికి దయ్యపు అచల్ అనే విద్యార్థికి హైదరాబాదు గాంధీ మెడికల్ కాలేజీలో సీటు రావడం జరిగిందని మునిగొండ అచల సంగారెడ్డి లోని ఎంఎన్ఆర్ కాలేజీలో మెడికల్ సీటు రావడం జరిగిందని అదేవిధంగా మేడిపల్లి యామిని రెడ్డికి కరీంనగర్ మెడికల్ కాలేజీలో సీట్లు వచ్చినట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. అయితే ఈ గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మెడికల్ లో సీటు సాధించడం వల్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## చెలిమిళ్లలో కాటన్ సెర్చ్

**పెబ్బేరు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిళ్ల గ్రామంలో సోమవారం రాత్రి కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్మకూరు సిఐ శివకుమార్ కొత్తకోట సిఐ రాంబాబు ఎస్సై లు హరి ప్రసాద్ రెడ్డి,మంజునాథ్ రెడ్డి, నరేందర్ రామకృష్ణ మరికొంతమంది 50 మంది పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 50 వాహనాలను తనిఖీ చేసి నాలుగు వెహికల్స్ ను ఎలాంటి డాక్యుమెంట్స్ లేనందున పెబ్బేరు పీఎస్ తరలించడంలో స్టైల్ 50 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.